నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, సోమవారం 1 ఏప్రిల్ 2024 VIKARABAD



**ఎమ్మెల్సీ వాణీదేవికి ఘనస్వాగతం** ఢిల్లీలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని నగరానికి వచ్చిన ఎమ్మెల్సీ వాణీదేవికి ఎయిర్‌పోర్టులో బంధు,మిత్రులు ఘనంగా స్వాగతం పలికారు. –బేగంపేట, మార్చి31

- చేవెళ్ల ఎంపీ స్థానంలో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీ
- వరుసగా నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలతో ప్రజల్లోకి..
- ఇప్పటికే పరిగి, తాండూరులలో పూర్తి
- జనం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు అనూహ్య స్పందన
- అయోమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి
- ప్రజలను నమ్మించేందుకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రచార పాట్లు
- ఆయన్ను నమ్మి మళ్లీ మోసపోమంటున్న నియోజకవర్గ ప్రజలు

# ప్రచార జోరు..



**చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుకెళ్తున్నది. ఇందుకోసం వరుసగా నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల్లోకి దూసుకెళ్తున్నది. బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తున్నది. బీసీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు అతడిని గెలిపించుకునేందుకు సిద్ధమవుతున్నారు.**

వికారాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం జోరందుకున్నది. చేవెళ్ల పార్లమెంట్ నుంచి బరిలో ఉండే అభ్యర్థులను బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ప్రకటించడంతో వారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మరోసారి గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించేలా బీఆర్‌ఎస్ పార్టీ పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నది. ఇప్పటికే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో సమావేశమై గెలుపుపై దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు మంచి పేరున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా నిలిపి బీఆర్‌ఎస్ పార్టీ గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నది. అంతేకాకుండా ప్రచారంలో ముందున్న బీఆర్‌ఎస్ పార్టీ.. నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తున్నది. ఇప్పటికే జిల్లాలోని పరిగి, తాండూరు నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాలు పూర్తికాగా, ఈనెల 3న వికారాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగనున్నది. కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నది. బీసీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు అతడిని గెలిపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాసానిని గెలిపించాల్సిన బాధ్యతను ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టున్న మాజీ మంత్రి, మహేశ్వర్ ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డికి పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆమె ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న సమావేశాల్లో పాల్గొంటూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ విజయానికి కృషి చేస్తున్నారు.

**అయోమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి..**

బీఆర్‌ఎస్ పార్టీని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరి.. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రంజిత్‌రెడ్డి అయోమయంలో పడ్డారు. ఆయన కాంగ్రెస్‌లో చేరడంతో పలువురు నాయకులు విమర్శిస్తున్నారు. ఇటీవల మహేశ్వరం నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ఎదుటే పరోక్షంగా రంజిత్‌రెడ్డిపై ఆ పార్టీ నేత కేఎల్‌ఆర్ విమర్శలు చేశారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పెద్ద ఎత్తున తన వెంట క్యాడర్ వస్తుందని భావించినా.. కాంగ్రెస్ పార్టీలోకి రంజిత్‌రెడ్డి అనుచరులను చేర్చుకోవద్దని బహాటంగానే సీఎంకు చెప్పినట్లు ప్రచారం జరుగుతున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడి, వ్యతిరేకంగా కార్యకలాపాలు చేసిన రంజిత్‌రెడ్డికి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, నాయకులు సపోర్టుగా పనిచేస్తారా..? అన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైకి గెలిపించుకుంటామంటూ చెబుతున్నా ఎమ్మెల్యే ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా పనిచేసిన రంజిత్‌రెడ్డిని ఎలాగైనా ఓడించాలనే కసితో కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. అంతేకాకుండా చేవెళ్ల లోక్‌సభ టికెట్ ఆశించి భంగపడిన పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం కూడా రంజిత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో సహకరిస్తుందా..? అనే అనుమానమూ వెంటాడుతున్నది. వీటన్నింటిని పరిశీలిస్తే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డిని సొంత పార్టీ నేతలే ఓడించడం ఖాయమనే ప్రచారమూ ఉన్నది..!

**విశ్వేశ్వర్‌రెడ్డికి ప్రజల మద్దతు అంతంతే..**

ఎన్నికల ప్రచారంలో ప్రజలను నమ్మించేందుకు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పడరాని పాట్లు పడుతున్నారు. ఆశీర్వాద యాత్ర పేరుతో ప్రస్తుతం పరిగి నియోజకవర్గంలో ఊరూరా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. అయితే ఆయన ఎంపీగా ఉన్న సమయంలో తమ బాధలను చెప్పుకొనేందుకు వెళ్లిన జనాలను కలవకుండా, వారి సమస్యలను వినకుండా వెనక్కి పంపించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రచారంలో ప్రజల మద్దతు కూడగట్టేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలంటూ బతిమిలాడుకుంటున్నారు. అయినా ప్రజల నుంచి స్పందన రాకపోవడం గమనార్హం. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయగా చేవెళ్ల ప్రజలు విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించారు. గెలిచిన తర్వాత చేవెళ్ల నియోజకవర్గ అభ్యున్నతికి ఏ ఒక్క ప్రాజెక్టునూ తీసుకురాలేదు. అంతేకాకుండా గెలిచిన తర్వాత తమ సమస్యలను చెప్పుకొనేందుకు వెళ్లిన ప్రజలకు అపాయింట్‌మెంట్ ఉందా..? అంటూ కోపమై వెనక్కి పంపిన ఆయన మాకు వద్దే..వద్దంటూ ఊరూరా జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఆయన్ను నమ్మి మరోసారి మోసపోలేమని.. ఎంపీగా గెలిపించబోమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.





బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థులు క్యామ మల్లేశ్, కాసాని జ్ఞానేశ్వర్

# బీఆర్‌ఎస్.. బీసీ మంత్రం

**చేవెళ్ల, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ బీసీ అస్త్రాన్ని సంధించింది. అధికార కాంగ్రెస్ ఓసీలకు టికెట్లు కేటాయించగా.. బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం బడుగు, బలహీన వర్గాల నేతలైన కాసాని జ్ఞానేశ్వర్, క్యామ మల్లేశ్‌లను బరిలో నిలిపింది. బీసీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆ వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలకతీతంగా బీసీలందరూ ఏకమవ్వాలన్న చర్చ జోరందుకున్నది..**

- చేవెళ్ల లోక్‌సభ నుంచి కాసాని జ్ఞానేశ్వర్, భువనగిరి బరిలో క్యామ మల్లేశ్
- బీజేపీ, కాంగ్రెస్‌లను ఇరుకున పెట్టేలా కేసీఆర్ వ్యూహాత్మక నిర్ణయం
- ఇది బీఆర్‌ఎస్‌కు సానుకూల అంశం అంటున్న రాజకీయ విశ్లేషకులు
- బీసీలకు రాజకీయ ప్రాధాన్యతపై రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ జోరందుకున్న చర్చ
- పార్టీలకతీతంగా ఏకం కానున్న బీసీలు!

రంగారెడ్డి, మార్చి 31(నమస్తే తెలంగాణ) : జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కొత్త అస్త్రాన్ని ప్రయోగించింది. కాంగ్రెస్, బీజేపీలను ఇరుకున పెట్టేలా చేవెళ్ల, భువనగిరి లోక్‌సభ స్థానాల నుంచి బీసీ అభ్యర్థులను రంగంలోకి దింపింది. అత్యధిక శాతం బీసీ ఓటర్లు ఉన్న ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో కేసీఆర్ వ్యూహాత్మకంగా బీసీ అభ్యర్థులను బరిలో నిలపడం బీఆర్‌ఎస్‌కు అనుకూలించే అంశంగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రెండు చోట్లా..ఒకట్రెండు సామాజిక వర్గాల లీడర్లే ఎంపీలుగా ఉంటూ వస్తుండడంతో.. బీసీలను గెలిపించుకునేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పార్టీలకతీతంగా ఏకమవ్వాలన్న చర్చ సైతం జోరందుకున్నది.

**జనరల్ స్థానాల్లోనూ బీసీలకే ప్రాధాన్యం..**

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పే కాంగ్రెస్, బీజేపీలు ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. చేవెళ్ల లోక్‌సభ బరిలో కాంగ్రెస్ పార్టీ రంజిత్‌రెడ్డి(ఓసీ)ని పోటీలో నిలపగా.. బీజేపీ సైతం తమ అభ్యర్థిగా విశ్వేశ్వర్‌రెడ్డి(ఓసీ)ని రంగంలోకి దింపింది. జనరల్ రిజర్వ్‌డ్ సీటు అయిన చేవెళ్ల లోక్‌సభ స్థానానికి బీఆర్‌ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా ముదిరాజ్ వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఇక భువనగిరి లోక్‌సభ స్థానానికి బీజేపీ నుంచి బూర నర్సయ్యగౌడ్(బీసీ) పోటీ పడుతున్నారు. బీఆర్‌ఎస్ సైతం బీసీ అభ్యర్థిత్వానికే మొగ్గు చూపి గొల్ల,కురుమ సామాజిక వర్గానికి చెందిన క్యామ మల్లేశ్‌ను బరిలో నిలిపింది. బీసీ అభ్యర్థినే నిలపాలన్న నినాదం తెరపైకి వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ దానిని పట్టించుకోకుండా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి(ఓసీ)ని అక్కడి నుంచి పోటీ చేయిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక బీసీల్లో అసంతృప్తిని రాజేస్తున్నది. జనరల్ స్థానాలు అయినప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను నిలిపి ప్రాధాన్యత కల్పించడం పట్ల బీసీ వర్గాలు సంతోషంగా ఉన్నాయి.

**పార్టీలకతీతంగా ఏకం కానున్న బీసీలు..!**

చేవెళ్ల, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మెజార్టీ ఓటర్లు బీసీలే ఉన్నారు. రెండు చోట్లా బీసీ ఓటర్లే కీలకంగా ఉన్నప్పటికీ ఒకట్రెండు సామాజిక వర్గాల నాయకులే ఎన్నికవుతూ వస్తున్నారు. ఏండ్ల తరబడిగా బీసీలకు రాజకీయ ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి రెండు ఎంపీ స్థానాల్లోనూ ఉన్నది. రాజకీయ పార్టీలు బీసీలను చిన్నచూపు చూస్తున్నాయన్న ఆవేదనను సైతం బీసీలు వ్యక్తం చేస్తూ వస్తున్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేసి ఆ వర్గాలకు చెందిన అభ్యర్థులను ఎంపీలుగా నిలబెట్టడడంతో ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా బీసీలను గెలిపించుకోవాలన్న ఆలోచనలో బీసీ వర్గాలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో పార్టీలకతీతంగా బీసీలందరూ ఏకమవ్వాలన్న చర్చ సైతం అంతర్గతంగా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు కాసాని జ్ఞానేశ్వర్, క్యామ మల్లేశ్‌లు తమ పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటిస్తుండగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే కాకుండా ఇతర వర్గాలకు చెందిన ప్రజల నుంచి కూడా అనూహ్యంగా మద్దతు లభిస్తున్నది. తమ సామాజిక వర్గానికి చెందిన కులాల మద్దతును కూడగట్టేందుకు ఇరువురు ఎంపీ అభ్యర్థులు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో సమాలోచనలు చేస్తూ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎత్తుకున్న బీసీ నినాదం రిజల్ట్‌లో కచ్చితంగా మార్పులు తీసుకొస్తుందని రాజకీయ విశ్లేషకులు సైతం పేర్కొంటున్నారు.

# ఉపాధి కూలి పెంపు

**రూ. 28 పెంచిన కేంద్రం.. నేటి నుంచి అమల్లోకి..**

బొంరాస్‌పేట, మార్చి 31: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు రోజూ చెల్లించే కూలిని కేంద్ర ప్రభుత్వం సవరించింది. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉపాధి కూలి రూ.272 చెల్లిస్తుండగా తాజాగా దీనిని రూ.28లకు పెంచింది. దీంతో కూలీలకు దినసరి వేతనం రూ. 300లకు పెరుగగా.. నేటి నుంచి అమల్లోకి రానున్నది. 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రారంభం కాగా మొదట్లో కూలీలకు రూ.87.50 చెల్లించేవారు. 2022లో రూ.12 పెంచగా 2023లో గరిష్ఠంగా కూలిని రూ.272 లుగా నిర్ణయించారు. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కొత్త వేతనాలను అమలు చేస్తున్నది. తాజా నిర్ణయంతో కూలీలకు ప్రయోజనం కలుగనున్నది.

**జిల్లాలో 2.55 లక్షల యాక్టివ్ కూలీలు**

వికారాబాద్ జిల్లాలో మొత్తం 1.34 లక్షల జాబ్ కార్డులుండగా 2.55 లక్షల మంది యాక్టివ్ కూలీలున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో వ్యవసాయ పనులు లేక గ్రామాల్లో కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. ఒండ్రుమట్టి తొలగించడం, కాల్వల మరమ్మతులు, పొలాల్లో నీటి నిల్వ కట్టడాల పనుల్లో పాల్గొని ఉపాధి పొందుతున్నారు. చేసిన పనులను కొలిచి..రికార్డు చేసిన దాని ప్రకారం కూలీలకు ప్రతిరోజూ రూ.250 నుంచి రూ.300 వరకు కూలి లభిస్తున్నది.

**వేసవి భత్యం లేక కొంత నష్టం**

దినసరి కూలిని రూ.28లకు పెంచినా కూలీలు కొంత అసంతృప్తిగానే ఉన్నారని చెప్పొచ్చు. గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉండడంతో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలీతోపాటు వేసవి అదనపు భత్యం చెల్లించేది. ఈ సమయంలో 15 నుంచి 30 శాతం వరకు అధికంగా కూలీ వచ్చేది. రెండేండ్ల నుంచి దానిని తొలగించడంతో కూలీలకు అదనపు భత్యం రావడం లేదు. అదేవిధంగా పార, గడ్డపారకు కూడా అదనంగా చెల్లించేవారు దీనిని కూడా నిలిపివేశారు.



# నేడు చేవెళ్లలో బీఆర్‌ఎస్ మీటింగ్

**హాజరుకానున్న మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు**

షాబాద్, మార్చి 31 : చేవెళ్లలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన జరుగనున్న ఈ మీటింగ్‌కు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, గాంధీ, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. సెగ్మెంట్‌లోని ఐదు మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

# రైట్..రైడ్.... ఓకే చలో




**ఓలా,ఉబర్, ర్యాపిడోలకు పోటీగా మరిన్ని యాప్‌లు**

**రైడ్ ధరను తగ్గించుకునే వెసులుబాటు**

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : సాధారణంగా క్యాబ్ సర్వీస్‌లో ఫేర్ ఎంత చూపిస్తే అంత చెల్లించాల్సిందే. కానీ ఇప్పుడు అగ్రిగేటర్స్ మధ్య ఉన్న పోటీతో వినియోగదారులకు మరింతగా సులభతర సేవలను అందించేందుకు సంస్థలు పోటీపడుతున్నాయి. నిర్ణయించిన రైడ్ ధరను సైతం తగ్గించుకునే వెసులుబాటు కల్పిస్తూ 'ఓకే చలో' యాప్ సేవలు అందిస్తున్నాయి.

**రైడ్స్ స్వీకరించేందుకు డ్రైవర్ల ఆసక్తి**

సికింద్రాబాద్ నుంచి బంజారాహిల్స్ వరకు క్యాబ్ రూ.220 చూపిస్తే కొత్తగా వచ్చిన వాటిలో రూ. 200 మాత్రమే చూపిస్తుంది. ప్రస్తుతం హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మియాపూర్, కూకట్‌పల్లి, ఔటర్ రింగురోడ్డు, ఐటీ కారిడార్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త క్యాబ్ సర్వీసులు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అలాగే శంషాబాద్ విమానాశ్రయం వద్ద కూడా ఈ సేవలు ఉన్నాయి. గతంలో కేవలం ఓలా, ఉబర్ మాత్రమే సర్వీసులు ఇస్తుండడంతో కమీషన్ల రూపంలో డబ్బులు కట్ అయ్యేవని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రైడ్స్ సైతం రద్దు చేశారు. కానీ ఇప్పుడు కొత్త యాప్‌లు రావడంతో డ్రైవర్లు రైడ్స్ స్వీకరించేందుకు ఆసక్తి చూపుతుండడం విశేషం.

**డ్రైవర్లకూ ఉపయోగకరంగా ..**

బేగంపేట నుంచి పంజాగుట్టకు క్యాబ్ ధర రూ.110 చూపితే అందులో కస్టమర్ తాను అనుకున్న అమౌంట్‌ను ఎంటర్ చేస్తే సరిపోతుంది. అందులో సదరు సంస్థ అతి తక్కువలో ఎంతకొస్తదో చూపిస్తుంది. అలా సంస్థ కస్టమర్‌ను దృష్టిలో పెట్టుకుని మార్పులు చేసింది. దీంతోపాటు ఓల్టా వంటివి దూర ప్రాంత ప్రయాణికులకు కూడా క్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా నగరంలో మనయాత్రి, యారీ, ఓల్టా, ఓకే చలో.. వంటి క్యాబ్ అగ్రిగేటర్స్ వచ్చేశాయి. దీంతో నగరవాసులు నచ్చిన క్యాబ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం లభించింది. డ్రైవర్లు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని గిగ్ వర్కర్స్ ప్రెసిడెండ్ సలావుద్దీన్ తెలిపారు. ఓలా, ఉబర్ వంటి సంస్థల్లో రోజంతా కష్టపడినా వెయ్యి రూపాయలూ రావడం లేదని.. ఇప్పుడు కమీషన్లు ఎక్కువగా తీసుకోకుండా కొత్త సంస్థలు డ్రైవర్లకు లాభం చేకూరేలా మార్పులు తీసుకొచ్చాయని వివరించారు. అంతేకాదు ఓలా, ఉబర్‌లతో పోలిస్తే ఫేర్ ధరలు కూడా తక్కువగా ఉన్నాయని చెప్పారు.

**క్యాబ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం..**

# మూసీ హైడ్రాలిక్స్ మోడల్స్ కోసం టెండర్ గడువు పొడిగింపు

- మూసీ సుందరీకరణకు ప్రభుత్వం చర్యలు
- కేసీఆర్ హయాంలోనే ఎంఆర్‌డీసీఎల్ ఏర్పాటు



సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): మూసీనది సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా హైడ్రాలిక్స్ మోడల్స్ రూపకల్పన కోసం పిలిచిన టెండర్ గడువు ఏప్రిల్ 6 వరకు పొడిగించారు. నగరం మధ్యలోంచి పారుతున్న మూసీనది మురికి నీటికూపంగా మారింది. దీన్ని పూర్తి స్థాయిలో సుందరీకరించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూసీనది సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. మూడేండ్ల కాల వ్యవధిలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా గండిపేట, హిమాయత్‌సాగర్‌ల నుంచి ప్రారంభమయ్యే నదుల ప్రవాహ ప్రాంతాలను సమగ్రంగా అధ్యయనం చేసి అవసరమైన నివేదికలను రూపొందించేందుకు 'సిమ్యులేషన్ మోడల్ ఫర్ హైడ్రాలిక్స్' పేరుతో టెండర్లను పిలిచింది. అనుభవం కలిగిన కన్సలెంట్ల ఎంపిక కోసం టెండర్లను ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఎంఆర్‌డీసీఎల్ బృందం అధికారులు డ్రోన్ సర్వేను చేపడుతున్నారు. ఈ సర్వే ద్వారా వచ్చిన డేటాను ఉపయోగించి మూసీనది ప్రవాహం తీరును అంచనా వేసి, ఎంపిక చేసిన కన్సల్టెంట్లు నివేదికలను రూపొందిస్తారని అధికారులు తెలిపారు.